

# తగిన శాస్తి

శ్రీ యం. వి. కృష్ణరావు.

శ్రీ మామగారికి రామచంద్రరావు అనేకనమస్కారములు. ఉభయ కుశలోపరి. మీరు దయతో రాసిన ఉత్తరంఅందినది. నేను మహదాశయాలుగల వాణ్ణని మీకు తెలుసుననుకుంటాను. లండన్ వెళ్ళి రెండేళ్ళన్నా చదువుకోకపోతే ఇప్పటి పరిస్థితుల్లో ఐ. సి. యస్. అవటానికి వీలుండదు. అందుకు కనీసం పదివేలరూపాయలన్నా కావలసివుంటుంది. మీరు లాబుక్కులు, బల్లలు, కుర్చీలు వగైరా కొనియిస్తామని రాసినారు. నాకు ప్లీడరీ, చెయ్యడం. సుతలాము యిష్టంలేదు. అందుచేత ఈ ఉత్తరం అందినవెంటనే పదివేలరూపాయిలు పంపించండి. అటుపిమ్మట కార్యం చేసుకుంటానికి యేవిధమైన అభ్యంతరంలేదు. ఒకవేళ కారణం చేతైనా డబ్బు పంపకపోతే మీ అమ్మాయితో నాకేమి సంబంధములేదని స్పష్టముగా తెలియపరుస్తున్నాను. తల్లిదండ్రుల తప్పిదాలకు పిల్లలు అనుభవించడం ధర్మమే! నేనేదన్నా అన్నానంటే అది నెరవేర్చి తీరుతాను. అందుకు మీరేమి సందేహపడనక్కరలేదు. తరువాత బ్రహ్మదేవుడు వచ్చిచెప్పినా వినను. మీ అమ్మాయి సుఖపడదలచుకుంటె డబ్బు తక్షణం పంపండి. లేకపోతే యెవరికివారే....చిత్తగించవలెను.

"రామచంద్రరావు."

పిడుగులాంటి ఆ ఉత్తరం చూస్తూనే లక్ష్మీపతి నీరైపోయాడు; ఉత్తరంచేతులోంచి జారి కిందపడ్డది. "సుశీలా!" అంటూ తడబడుతున్న కాళ్ళతో యింటిలోపలికి వెళ్ళి తన ముద్దులకూతురుకా ఉత్తరాన్ని యిచ్చాడు. ఇంట్లో అంతా ఒక్కసారి గొల్లుమన్నారు.

లక్ష్మీపతి సామాన్య సంసారి. నలుగురు ఆడపిల్లలుగలవాడు. రెండువేలు కట్నం యిచ్చి. అన్ని ముద్దుముచ్చట్లు జరిపి సుశీల పెళ్ళి మహావైభవంగా చేశాడు. కార్యం చేసుకోవలసిందని ఉత్తరం రాస్తే దానికి అల్లుడిగారిదగ్గరనుంచి వచ్చిన జవాబు ఉత్తరం! సుశీలకి పదిహేనేళ్ళుంటాయి. అంత అందకత్తె కాకపోయినా, కాలువంకరగాని కన్ను వంకరగాని లేదు. చదువుసంధ్యలలో అతి చురుకైనది. సంగీతసాహిత్యాలలో ప్రవేశం కూడా కద్దు. చాలా బుద్ధిమంతురాలు. పెళ్ళి అయినతరువాత ఒక్కసారిగూడా భర్తతో మాట్లాడలేదు: ఇప్పటికాలంవాళ్ళ ఉత్తరాలు రాసుకోవడం కూడా యెరగదు. తన తండ్రి పదివేలరూపాయిలు తన భర్తకు యిచ్చుకోలేకపోతే తనతోటి సంబంధంలేదని భర్తరాశాడు. ఇంకా ముందు ఏమిచేస్తాడో అనే ఆలోచనలో పడ్డది సుశీల.

"సుశీలా! మీఆయన రాసిన ఉత్తరం చూశావుకదూ. ఇప్పుడు నేనెక్కడనుంచి పదివేలు తేగలను? పెళ్ళికావలసినవాళ్ళు నీకింకా చెల్లెళ్ళున్నారు. మనకున్న ఆస్తి అంతా అమ్మినా పట్టుమని పదివేలు రాదు. ఆ తరువాత మా కష్టాలు మేము పడతామనుకో—నీవు సుఖపడటమే మాకు కావలసింది. ఇంతకీ బీదవాళ్ళింట్లో పుట్టడంవల్ల కదా నీభర్త నిన్ను పరిత్యజిస్తానంటున్నాడు."

"నాన్నగారూ, మీరుమాత్రం ఏం చెయ్యగలరు? నన్ను సుఖపెట్టాలని శాయశక్తులా ప్రయత్నంచేసి మంచి సంబంధమే చేశారు. మీ అల్లుడుగారికి ఇలాంటి ఉద్దేశాలు కలగటానికి నా దురదృష్టం కారణమేమో! నా కర్మకి మీరేంచెయ్యగలరు? ఆస్తిఅమ్మి మీరు కష్టాలపాలుకావద్దు. కట్టుకున్న పెళ్లాన్ని పరిత్యజించి ఏడిపించిన వాళ్ళెప్పుడూ వృద్ధిలోకి రాలేదు. ఆయన బెదిరించి డబ్బు లాగటానికి అలా రాశారు కాని, యింకా దారుణమైన పనులేమీ చెయ్యలేరనుకుంటాను. చివరికి పశ్చాత్తాపం కలిగి నాకోసం అయనే వస్తారని నాకు గట్టి నమ్మకముంది. భారమంతా దేవుడిమీదవేసి కాలక్షేపం చేద్దాం."

"ఇంత వివేకవతీవి నిన్ను పరిత్యజిస్తా జిస్తా నంటానికి అతనికెలా నమస్కారిం చిందో తెలియకుండా వున్నది. అయినా నేను ఒకసారి పట్నంవెళ్ళి అతనితో ముఖా ముఖి మాట్లాడి వస్తాను."

★

రామచంద్రరావు, ఏడ్వకేటు సుందరరావు ఏకైక పుత్రుడు. మంచి రూపసి, షౌకెల్లా పురుషుడు. బి. యల్. ప్యాసయినాడు. పిల్లకట్టడం యెంతమాత్రం యిష్టంలేదు. సీమలో రెండేళ్ళపాటు చదివి, ఐ. సి. యస్. అవశ్యం కావాలనే ఉద్దేశంలో ఉన్నాడు. తండ్రి తనదగ్గర డబ్బులేదనటంవల్ల; బెదిరించి మామగారి దగ్గిర గుంజటానికి పదకం వేశాడు.

మంచిరోజు చూసి లక్ష్మీపతి మద్రాసు చేరుకుని సుందరరావుగారింటికి వెళ్లాడు. అప్పుడు సుందరరావు ఆఫీసు లా బుక్కులు తిరిగేస్తున్నాడు.

"దయచేయండి. బావగా రెప్పుడు వచ్చారు?"

"ఇప్పుడే; అయితే, ప్రపంచంలో ఎక్కడన్నా ఉన్నదిటండీ ఇలాంటి ఘోరమైన సంగతి;"

"నాకేమీ తెలియదు. మా అబ్బాయి నా అంతవాడైనాడు. వాడేం బుద్ధిలేనివాడు కాడు. అదీగాక వాడి సొంతవిషయాల్లో నేనేమీ జోక్యం కలగజేసుకోను. మేడమీదికి వెళ్ళి వాడితో మాట్లాడితేనే మంచిది" ఇలా చల్లగా తప్పించుకున్నాడు సుందరరావు, లక్ష్మీపతి మేడమెట్లు యెక్కుతుంటే రామచంద్రరావు సూటు వేసుకుని, టెన్నిస్ బ్యాటుతో సహా మెట్లు దిగుతున్నాడు. లక్ష్మీపతి పైకి వెళ్ళటానికి యేమాత్రం ఆలస్యం చేసినా రామచంద్రరావు కంటికి కనబడకుండా వెళ్ళేవాడే! మామగారే స్వయంగా రావటంవల్ల డబ్బేమన్నా తీసుకొచ్చాడేమో అని ఆశకలిగి రెండడుగులు వెనక్కి వేశాడు.

"ఏమోయి రామచంద్రరావ్! ప్రపంచంలో ఎక్కడన్నావుందీ యిలాంటి దారుణం! నేనంత భాగ్యవంతుణ్ణి కానని నీకు తెలుసును గదా. పిండినా తడ్డిగుడ్డనిపిండాలిగాని పొడి గుడ్డనిపిండితే ఏమిలాభం?"

"నాకదంతా తెలియదు. వొట్టిశుష్కలతో ఏమీప్రయోజనంలేదు. ఇంగ్లెండు పంపటానికి సంసిద్ధులైవుంటె మాట్లాడండి. మళ్ళ నేను టెన్నీసుకు వెళ్ళాలైమైంది."

"హఠాత్తుగా పదివేలెక్కడనుంచి తెమ్మంటావు? నాకున్న ఆస్తి అంతా అమ్మినా పట్టుమని పదివేలురాదు. ఇప్పుడు కాంగ్రెస్ గవర్నమెంటువచ్చినతరువాత సీమ చదువులకేమీ ప్రాధ్యానం ఇవ్వరుట. నేను పిల్లలుగలవాణ్ణి; నువ్వు బుద్ధిమంతుడివి. నీ ముద్దుముచ్చట్లన్నీ నేను తీరుస్తాను. ఇలాంటి గొంతెమ్మకోరికలుకోరక. నామాటవిని సీమ ప్రయాణం మానెయ్యి."

"నేనొక నిశ్చయానికివస్తే బ్రహ్మదేవుడు చెప్పినా వినని మీకు ఉత్తరంలో నే రాశాను. తమరు నాక్కావలసిన డబ్బు యిచ్చుకోలేని స్థితిలోవున్నప్పుడు తక్షణం యిక్కడనుంచి దయచెయ్యండి. నేనింకో అమ్మాయిని చేసుకుంటె అందుకు బాధ్యత మీరే వహించాలి. అరే కాసీం! కారు సిద్ధం చెయ్యి" అంటూ టకటకా మెట్లుదిగి వెళ్ళిపోయాడు రామచంద్రరావు. నిరుత్తరుడై లక్ష్మీపతి ఆరాత్రి మెయిలులో బెజవాడ చేరుకున్నాడు.

తనభర్త మళీపెళ్ళి చేసుకునే సంకల్పంలో వున్నాడనివిని సుశీల దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. 'ఏజన్మలో ఏభార్యాభర్తలకు వియోగం కలిగించానో, ఈ జన్మలో అనుభవిస్తున్నాను' అనుకుంది. తల్లిదండ్రులు యెన్నివిధాల ఓదార్చినా ఆ అమ్మాయి దుఃఖం ఉపశమించలేదు. గట్లు తెగిననదివలె ప్రవహిస్తోందిసుశీలశోకం.

★

బాగా కట్నంపుచ్చుకుని కొడుక్కి మళ్ళా పెళ్లి చెయ్యాలనే ప్రయత్నంలో ఉన్నాడు సుందరరావు. ఈరోజుల్లో పిల్లమీద పిల్లని యెవరిస్తారు? యెందుకిస్తారు? అందుకని ప్లీడరుగారు తన తెలివితేటలన్నీ వినియోగించి చివరికి సుశీలమంచిదికాదనీ, అందుచేత కొడుక్కుమళ్ళా పెళ్ళిచెయ్యాలనే సన్నాహంలో ఉన్నట్లూ చాటుతున్నాడు. మొదట్లో యెవరూ పిల్లనివ్వటానికి సిద్ధంకాలేదు. కాని హైకోర్టువకీలుకి వక్కడే కొడుకు. స్పురద్రూపి, ప్లీడరీ ప్యాసయినాడు, అందుచేత కొందరు ఆశపడ్డారు. అయిదువేలుకట్నం పుచ్చుకుని గుట్టుచప్పుడు కాకుండా అదవివారి అమ్మాయిని మద్రాసులో చేసుకుంటానికి నిశ్చయించుకున్నాడు సుందరం ఈ వివాహ విషయం పిట్టకితెలియకుండా వుంచారు. అయితే ఫలానిరోజున పెళ్ళని ఆయన మిత్రుడొకడు లక్ష్మీపతికి ఉత్తరం రాశాడు. తనభర్త 'మళ్ళీపెళ్ళి' కాకముందే తన్ను మెద్రాసు తీసుకెళ్ళమని సుశీల తండ్రిని అడిగింది. అందుకు లక్ష్మీపతి అంగీకరించాడు.

పెళ్లినాటికి తండ్రీ కూతురూ, మెద్రాసు చేరుకున్నారు. చుట్టుప్రక్కలి వుండే పెద్ద మనుష్యులు, గవర్నమెంటు ఉద్యోగస్థులు చేత లక్ష్మీపతి ఇది కూడనిపని అని చెప్పించాడు సుందరరావుకి.

"నాకేమీ తెలియదు. నా కొడుకుని అడగండి" అని సుందరరావు చల్లగా జారుకున్నాడు. పెళ్ళిరోజంతా లక్ష్మీపతి తాలుకావాళ్ళ నెవరిని రానివ్వవద్దని అర్డరు మంజూరుచేస్తూ, సుందరరావు తన గుమాస్తా రామాన్ని గేటువద్ద కోపలాపెట్టాడు. అల్లరి జరగకుండా ఆ ప్రాంతాల్లో పోలీసు

వాళ్ళ బందోబస్తుకూడా చేశాడు. శోకమూర్తి సుశీలని వెంటపెట్టుకుని లక్ష్మీపతి గేటువద్ద నిలబడ్డాడు. గేటు మూయబడి వుంది: రామం వేటకుక్కలా కాపలా కాస్తున్నాడు.

"రామం, కాస్త గేటుతాళం తియ్యి. మా అమ్మాయి రామచంద్రరావుతో మాట్లాడాలంటోంది. మొగుడు పెళ్లాన్ని వేరుచేసిన పాపం కట్టుకోకు. నీకుమాత్రం హృదయం లేదూ? అమ్మాయి అలా ఏడుస్తూంటె, తలుపు తీయటానికి వీలులేదనటానికి నీకు నోరెలా వస్తుంది?"

"అయ్యా! అనవసరంగా నన్నెందుకు నిందిస్తారు? నా శరీరాన్ని సుందరరావుగారికి అమ్ముకున్నాను. మంచి కానివ్వండి, చెడ్డ కానివ్వండి, వారు చెప్పిందల్లా శిరసావహించడం నావిధి. మీఅమ్మాయి దుఃఖం చూస్తే నా హృదయం తరుక్కుపోతోంది. మీరంతగా ప్రాధేయపడుతున్నారు గనక మీపేరు చెప్పకుండా ఎవరో వచ్చారని రామచంద్రరావుని యిక్కడికి తీసుకొస్తాను. మీ అమ్మాయి చెప్పదలచుకున్న నాలుగు ముక్కలూ అప్పుడు చెప్పమనండి. సుశీలమ్మ మాటలు విని భగవంతుడు అతనికి మంచి బుద్ధి తోపిస్తాడేమో!"

జాలిగుండె కలవాడు కాబట్టి రామం యజమానికి తెలియకుండా రామచంద్రరావుని వెంట పెట్టుకుని గేటుదగ్గరకు తీసుకొచ్చాడు. పసుపు గుడ్డలతో భర్తను చూసేటప్పటికి సుశీల దుఃఖం పొంగి పొర్లింది. గద్గద స్వరంతో ఇలా అన్నది:

"మీరు మళ్ళీపెళ్ళి చేసుకుంటున్నారని నాకేమీ విచారంలేదు, పోనీ ఆ అమ్మాయితోఅన్నా సుఖంగా కాపురం చేస్తారని ఆశిస్తాను. అయితే నాదొక్క మనవి వుంది: భర్తవున్న స్త్రీ యెల్లకాలం పుట్టింట్లోనే వున్నట్లయితే సాధ్వీమణినైనా జనులు శంకిస్తారు. అందుచేత నేను మీతో ద్వితీయ కళత్రం మీయింట్లో ఉంటానికి అనుగ్రహించండి."

ఆ మహాపతివ్రత పవిత్రమైన మాటలు వినేసరికి రామచంద్రరావు మనసు కరిగింది. ఆయితే ధనకాంక్ష, ఉద్యోగ కాపీనం పైకి వచ్చాయి. "ససేమిరా. నేనందుకు వొప్పుకోను" అన్నాడు. తండ్రి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. "చందుడూ! ఇక్కడేం చేస్తున్నావు? పద. ముహూర్త సమయం సమీపిస్తోంది" అన్నాడు.

దొరికిందిగదా అవకాశం అనుకుని లక్ష్మీపతి సుందరరావుని దులిపేశాడు: "నా కూతురు కొంపం తీశావు, నువ్వు బాగుపడవు. నిక్షేపంలా భార్యబ్రతికి వుండగా పిల్లనిచ్చేవాళ్ళకి మాత్రం బుద్ధి వుండక్కరలేదూ? పెళ్ళినాడిచ్చిన రెండువేల కట్నం చాలక, కార్యం చేసుకుంటానికి పదివేలు కట్నమా? ఈ కట్నాలతో ఎన్ని కుటుంబాలు నాశనమౌతున్నయో. ఎన్ని సంసారాలు చితికిపోయాయో! ధనకాంక్షకి హద్దుండాలి,"

........అంతా అరణ్యరోదనమైంది,

౨

నేను ఆఫీసులో పనిచేసుకుంటూ వుండగా లక్ష్మీపతి సుశీలని వెంటపెట్టుకుని వచ్చాడు. చిన్నప్పటినుంచీ లక్ష్మీపతిని ఎరుగున్నప్పటికి ఆయనతో నేనెప్పుడూ మాట్లాడలేదు. అనవసరంగా యింకొకళ్ళతో మాట్లాడే స్వభావంకాదు నాది. అందువల్ల చాలమంది నాకు అమితమైన గర్వమని అనుకుంటారు. మామూలు మర్యాదలైనతరవాత,

"అయితే లక్ష్మీపతిగారు! ఏమిటి విశేషాలు? అమ్మాయితోకూడా దయచేశారు"అన్నా.

ఇప్పటివరకు జరిగిన కథ అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు లక్ష్మీపతి. "రామచంద్రరావు సీమవెళ్లే ప్రయత్నాన్ని విరమించుకుని బి. ఓ. సి. కంపెనీలో ఉద్యోగం చేస్తూ, ఏదో నూటఏభై రూపాయలు సంపాయించుకుంటున్నాడుట. మనం మనువర్తికి యెందుకు దావా వెయ్యకూడదు?"

"మహారాజులా వెయ్యవచ్చు. దానికేమి అభ్యంతరంలేదు. ఇదేం వితంతువులు మనువర్తి కోరే విషయం కాదు. భార్యకి భర్త జీతం సగం యిచ్చితీరాలి. నాకోసం దేహముంది. ఇక యెప్పటికి రామచంద్రరావుతోటి సంబంధం తెగ్గొట్టుకోవడమేనా, లేక ఎప్పటికైనా భార్యాభర్తలు తిరిగి కలుసుకోవాలనే ఉద్దేశమేమన్నా వుందా? అయినా ఈ విషయంలో మీ అమ్మాయి అభిప్రాయం ఏమిటి?"

"హిందూ స్త్రీకి పతియే దైవం. కాబట్టి మనువర్తికోసం దావాచేస్తే ఈజన్మకి ఆయనతోటి సంబంధం వొదులుకోవటం జరుగుతుంది. అది నాకు యెంతమాత్రం యిష్టంలేదు."

"సెభాష్! హిందూస్త్రీల గౌరవం నిలబెట్టావు. వ్యవహారికం విషయంలో ఏమి ఆక్షేపణలులేవు. రామచంద్రరావు సొంత వస్తూరీతో రాసినఉత్తరమే వున్నది మన దగ్గిర. కోర్టువారు దుంపతెగేసి మనువర్తి యిప్పిస్తారు. కోర్టుకియెక్కితే రామచంద్రరావుకి బాగా అక్షింతలుగూడా తగులుతాయి. ఇతరప్లీడర్ల మాదిరి ప్రతివిషయానికి కోర్టుకి యెక్కించేవాణ్ణి కాను నేను. అందుచేత నా సలహా ఏమిటంటే మనం యిప్పుడు మనువర్తికి దావా వెయ్యవద్దు. పోనీ సుశీలమ్మని తీసుకెళ్ళి అతనికి వొచెప్పబుతారా అంటె, రామిచంద్రరావు పరిగ్రహిస్తాడని నాకు నమ్మకంలేదు. ఏం అమ్మాయి! అత్తవారింటికి వెళ్ళటం నీకిష్టమేనా?"

"ఆయనకు నిజమైన పశ్చాత్తాపం కలిగితేనేగాని నాకు వెళ్ళాలనిలేదండి. భార్యాభర్తలు అన్యోన్యంగా వుండటంపోయి నాకాయింటి చాకిరి, సవితిపిల్లలచాకిరీ తగులుతుందని భయంగా వున్నది. ఈయనవచ్చి రమ్మనమని బ్రతిమాలుకున్నప్పుడే వెడతాను. అంతవరకు చదువుకుంటాను."

"భేష్! చాలా బాగుంది. అమ్మాయిని చదివించండి. బి. ఎ., యల్. టి., ప్యాసయిందంటే వందరూపాయిల ఉద్యోగం తప్పకుండా అవుతుంది. అప్పుడు రామచంద్రరావుకి ఒక్కరిజిస్టరునోటీసు తగిలించామంటే సుశీలమ్మ కాళ్ళమీద పడి బ్రతిమాలుకుంటాడు. స్త్రీలకి ఆర్థికస్వాతంత్ర్యంలేకపోబట్టే మగవాళ్ళంత చులకనగా చూస్తున్నారు. సుశీల నాలుగుడబ్బులు సంపాయించుకోగలిగేస్థితిలో వుప్పుడు రామచంద్రరావుకాదు అతని తలలో జేజెమ్మసహితం వచ్చి కాళ్ళమీదపడుతుంది. అప్పుడెలాగూ మీ అమ్మాయిని ఏలుకోక తప్పదు. అంతవరకు కాస్త వోపిక పట్టండి. తొందరపడి దావాలోకి దిగవద్దు."

"అలాగే బాబు అలాగే! చిన్నవాడివైనా యెంత బుద్ధికుశలత. యెంత న్యాయదృష్టి వుంది!"

"ఏదో మీబోటి పెద్దల ఆశీర్వచన బలం వుంటే నాకొచ్చిన లోటేమిటి?"

## 3

కాలప్రవవాహంలోపడి ఎందరు మహావ్యక్తులు, ఎన్ని సామ్రాజ్యాలు, యెన్ని సంస్థలు, యెంతదుఃఖాలు మునిగిపోలేదు. ఎన్నివిచారాలు వచ్చినా, ఎన్నికష్టాలు కలిగినా కాలక్రమేణా వాటి ముమ్మరం తగ్గుతుంది. మానవప్రకృతినూతన పరిస్థితులకి అనుగుణ్యంగా మార్పుచెందుతుంది. గాఢమైన ప్రేమానుబంధాలున్నవాళ్ళు తమముఖ్య ప్రాణులమరణం సహించలేక తమప్రాణాలు గోల్పోయినవాళ్లు ఎందరో వున్నారు. అది వొక్కొక్క వ్యక్తియొక్క మనఃప్రవృత్తిని బట్టి వుంటుంది. భర్త. తన్ను పరిత్యజించినందున సుశీల ఆత్మహత్య చేసుకోవలసిందే. అయితే చనిపోయి ఎవర్ని సాధించగలం? బ్రతికివుండే భర్తకి మంచిగుణపాఠం నేర్పాలనే పట్టుదలతో పదేళ్ళపాటు కాలంగడిపింది. దైవానుగ్రహంవల్ల సుశీల యల్, టి., ప్యాసై ఏలూరులో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది.

ఈ పదేళ్ళలో రామచంద్రరావు స్థితిగతులు తారుమారైనాయి. పై అధికారులలో ఏదో పట్టింపువచ్చి, నెలరోజులు నోటీసుయిచ్చి రిజిగ్నేషన్‌దాఖల్ చేశాడు. మునుపటి స్థయిలులో సంసారం గడవటం కష్టమైంది. రామచంద్రరావు పరిస్థితులు నీరసించాయని లక్ష్మీపతి నాతో చెప్పడంతోనే, సుశీలకు నెలకు ఏభై రూపాయలు చొప్పున మనువర్తి యివ్వవలసిందని, లేకపోతే దావా చెయ్యకతప్పదని ఘాటైన రిజిస్టరు నోటీసు తగిలించాడు. దానికి జవాబివ్వకుండా రామచంద్రరావు ఒకరోజు ప్రొద్దున నా ఆఫీసులో హాజరైనాడు, ఇలా వుంటుంది మానవప్రకృతి!

"ప్లీడరుగారూ! భార్యాభర్తలు బ్రతికివుండగా భార్యకు భర్త మనువర్తి ఇవ్వడమేమిటి? మహారాణీలాగు సుశీలని నాదగ్గరే ఉండమనండి."

"నేను అలా సలహాయివ్వబట్టే ఇన్నాళ్ళు ఊరుకున్నారనుకోండి. లేక తొందరపడి మీ రెండోపెళ్ళి కొత్తతో మనువర్తి దావా చేసివుంటె, ఈ జన్మకి భార్యాభర్తల సంయోగం జరిగివుండేది కాదు. నీ నడవడి చాలా గర్హనీయము. నీ మామగారికి నీవురాసిన ఉత్తరం చూసి చాలా సిగ్గుపడ్డాను. చదువుకున్నవాడివి నువ్వుగూడా యిలా ప్రవర్తించడమేమిటి? ఇప్పటికైనా నీకు నిజంగా పశ్చాత్తాపం కలిగినందుకు నాకు చాలా ఆనందంగా వున్నది. ఏలూరువెళ్ళి సుశీల క్షమార్పణవేడుకో. అంతకంటె వేరే మార్గం కనబడటం లేదు. ఇద్దరూ చిరకాలం సఖ్యతగా వుండమని ఆశీర్వదిస్తాను."

* * *

"సుశీలా! నన్ను క్షమించవూ? నీ విషయంలో మహాపరాధం చేశాను."

"మగవాళ్ళు. ఆడవాళ్ళు, చిన్న పిల్లల మాదిరి ఏడ్వకూడదు. లెండి. నాకు దేనికీ కష్టం కలగలేదు గాని మీ తండ్రిగారు సుశీల శీలం మంచిదికాదూ అందుకనే కొడుక్కి మళ్ళీపెళ్ళి చెయ్యాలనే ప్రయత్నంలో ఉన్నానన్నా మాట. ఆమాట నా హృదయానికి శూలంలా గుచ్చుకున్నది. ఇది వారనవలసిన మాటేనా? ధనకాంక్ష వుంటె వుండవచ్చు గాని. మంచివాళ్ళని చెడ్డవాళ్ల అని అనకూడదు."

"అలా అనటం ఘోరమైన పాపం. దానిఫలితం ఇప్పుడు నేను అనుభవిస్తున్నాను. ఈ పదేళ్ళుకనబడలేదు. పోగాలం దాపించినపుడు దీపనిర్వాణగంధమును మూర్కొనడు, అరుంధతిని కనడు, మిత్రుని మాటవినడు. చేసుకున్న పెళ్లాన్ని ఏడిపించిన వాళ్లెప్పుడూ బాగుపడరు. ఇందుకు తార్కాణం నేనే! వాటికేంగాని ఆ ప్లీడరు ఉద్దండుడు లాగున్నాడు. ఆయన సలహాతో నాకు తగికశాస్తిచేశారు; చక్కటిగుణపాఠం నేర్పారు. ఆదర్శమైన జీవితం అందరికీ ఒక దివ్యజ్యోతిలాగుంటుంది."